క్లుప్తంగా

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన నాగపురి



జనగామ: రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ హైదరాబాద్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం జనగామ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించి, పలు అభివృద్ధి అంశాలకు సంబంధించి మంత్రి వినతిపత్రం అందజేశారు. ఇటికాలపల్లి మాజీ సర్పంచ్ లింగం తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మనోజ్‌రెడ్డి



చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గం కోఆర్డినేటర్ కేవిరెడ్డి మనోజ్‌రెడ్డి బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరిని ప్రజలకు తెలియజేస్తూ స్థానిక ఎన్నికల వరకు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసి అభ్యర్థులను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు.

చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ క్రీడా అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ శివసేనరెడ్డిని ఘన్‌పూర్ నియోజవకర్గ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా చైర్మన్ శివసేనరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. మండలంలోని నమిలిగొండలో ఉన్న ఇండోర్ స్టేడియాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి కేశిరెడ్డి లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కీసర దిలీప్‌రెడ్డి, కుందూరు శ్రీనివాస్‌రెడ్డి, లక్కిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, డానియల్ పాల్గొన్నారు.

నేడు కృతజ్ఞత ప్రదర్శన

దేవరుప్పుల: సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన పంట రుణమాఫీ అమలు చేయబోతున్న తరుణంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిఝాన్సీరెడ్డి సూచనల మేరకు నేడు ఉదయం 10 గంటలకు జనగామ–సూర్యాపేట రహదారి చౌరస్తాలో కృతజ్ఞత ప్రదర్శన చేపడుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ మండల నాయకులు,ఆయా గ్రామాల నాయకులతోపాటు రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సంబురాలను ఘనంగా నిర్వహించాలి

బచ్చన్నపేట: సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు పంట రుణాల మాఫీ చేస్తున్నందుకు నాయకులు, అన్నదాతలు కలిసి సంబురాలను ఘనంగా నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా నుంచి రైతు వేదిక భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అన్నదాతలు, నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కిసాన్, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ సెల్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నేడు నేత్ర వైద్యశిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, శివునిపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో హనుమకొండ శరత్ మాక్స్ విజన్ వారిచే మండలంలోని శివునిపల్లిలో నేడు(గురువారం) ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ఎండీ.దస్తగిరి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సేయింట్ థామస్ హైస్కూల్ సమీపాన దస్తగిరి నివాసంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందిస్తారని, ఆపరేషన్ అవసరమైన వారికి చేయిస్తారని తెలిపారు. పూర్తి వివరాల కోసం 91330 86000, 91339 00054 నంబర్లలో సంప్రదించాలన్నారు.

'అంగన్‌వాడీ'ల ర్యాలీ

జఫర్‌గఢ్: మండలంలోని కేజీతండా, తిమ్మాపూర్ గ్రామాల్లో 'అమ్మమాట–అంగన్‌వాడీ బాట' ర్యాలీని అంగన్‌వాడీ టీచర్లు బుధవారం నిర్వహించారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. టీచర్లు వీనారాణి, సునీత, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు



రఘునాథపల్లి: ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



గరుడ వాహనంపై లక్ష్మీనృసింహస్వామి



బచ్చన్నపేట: కొడవటూర్‌లో..

రఘునాథపల్లి: మండలంలోని ఆలయాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు చేశారు. బుధవారం ఆయా గ్రామాల్లో గ్రామస్తులు శివాలయాలకు చేరుకొని అర్చనలు, అభిషేకాలు చేశారు. పాడి పంటలతో చల్లంగా చూడాలని మొక్కుకున్నారు. రఘునాథపల్లి శ్రీమహాదేవస్వామి ఆలయంలో వేద పండితులు పిండిపోలు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూరెళ్ల పెద్ద ఉపేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, పద్మశాలి సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి–రాజేశ్వరి దంపతులు పాల్గొన్నారు.

చిల్పూరులో భక్తుల రద్దీ

చిల్పూరు: తొలి ఏకాదశి పురస్కరించుకుని బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో బుధవారం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఉదయం నుంచే భక్తులు స్వామి వారిదర్శనం కోసం వేచిఉన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు రవీందర్‌శర్మ అర్చకులు రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ భాగం లక్ష్మిప్రసన్న ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పాల్లపల్లి శ్రీధర్ రావు, కిరణ్మయి, ఉత్సవ కమిటీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి, దాత సంగోజు మోహనాచారి, శంకర్ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నిడిగొండలో గరుడ వాహనంపై లక్ష్మీనృసింహస్వామి

మండలంలోని నిడిగొండ లక్ష్మీనృసింహ ఆలయంలో తొలిఏకాదశి పురష్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గరుడ వాహనంపై లక్ష్మీనృసింహస్వామి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు కేవీజీకే అచార్యుల వేద మంత్రాలతో శ్రీవిష్ణు సహస్రనామపారాయణం, పుష్పార్చన చేశారు.



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు



పాలకుర్తి టౌన్: వల్మిడి సీతారామచంద్రస్వామి ఆలయంలో..

గ్రామాల్లో..

స్టేషన్‌ఘన్‌పూర్: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా డివిజన్ కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో దేవాలయాల్లో భక్తులు విశేష పూజలు చేపట్టారు.

బచ్చన్నపేట: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాలలో ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కొడవటూర్‌లోని స్వయంభూ శ్రీసిద్దేశ్వరాలయంలో, బండనాగారం, చిన్నరామనచర్ల, పడమటికేశ్వాపూర్, బచ్చన్నపేట, కేసిరెడ్డిపల్లి, కొన్నె గ్రామాలోని శివాలయాలలో గ్రామస్తులు పూజలను నిర్వహించారు.



స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ కనకదుర్గమ్మ గుడిలో..

సోమేశ్వర ఆలయంలో..

పాలకుర్తి టౌన్: తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, వల్మిడి సీతారామచంద్రస్వామి ఆలయంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లోక కల్యాణర్థమైన మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అర్చకుల మంత్రోచ్చారణ మధ్య విశేష పూజలు నిర్వహించారు. ఈఓ భాగం లక్ష్మీ ప్రసన్న,అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బీరప్పకు మొక్కులు



బోనాల జాతరలో కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కంచె రాములు, ప్రముఖులు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న సంఘం సభ్యులు



బోనంతో మహిళ



బీరప్ప ఆలయం వద్ద కురుమ కులస్తులు

జనగామ: తొలి ఏకాదశిని పురస్కరించుకుని కురుమ కులస్తులు బీరప్ప స్వామికి బుధవార ం బోనాలు సమర్పించారు. కళాకారుల డోలు విన్యాసాలు.. శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలు సంస్కృతి, సంప్రదాయాలను తెలియ జేసింది. సాంప్రదాయ దుస్తుల్లో మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు కురుమ కుల సంఘ పెద్దలు అమ్మవారికి బోనం సమర్పించి, ప ట్టువస్త్రాలు సమర్పించారు. జనగామ కురుమ సంఘం, సంఘం జిల్లా అధ్యక్షుడు కంచె రాములు ఆధ్వర్యంలో బీరప్ప బోనాల పండగ కనుల పండువగా జరిగింది. కుర్మవాడ, సాయి నగర్, జ్యోతినగర్, ధర్మకంచ, నాగులకుంట, బీరప్ప ప్రాంతాల నుంచి వందలాది మంది మహిళలు బోనం ఎత్తుకుని డప్పుచప్పుళ్లతో ర్యాలీగా బొడ్రాయి వద్దకు చేరుకున్నారు. బోనాల జాతరను కనులారా తిలకించేందు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. బొడ్రాయి వద్ద గుమ్మడి కాయలు, నిమ్మకాయలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడి నుంచి మహంకాళి దేవాలయం, గడి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నేరుగా బీరప్ప ఆలయానికి చేరుకున్నారు. బీరప్ప దేవుడికి నైవేద్యం సమర్పించి.. పిల్లా పాపలు సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు.

మొక్కుల చెల్లింపులు

పట్టణంలోని బీరప్ప కామారతి, మహంకాళి అమ్మవార్లకు సంఘ పెద్దలు బాల్దె మల్లేశం ఆధ్వర్యంలో మొక్కులు చెల్లించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు పండాలని కోరుకున్నారు. బోనాల పండగ నేపథ్యంలో పోలీసులు కట్టు దిట్టమైన బందోబస్తు చేపట్టారు. ఆర్టీసీ చౌరస్తా, బొడ్రాయి. నెహ్రూపార్కు, బీరన్న టెంపుల్ తదితర ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించారు. పూజారి వారణాసి పవన్‌శర్మ, కౌన్సిలర్లు జూకంటి లక్ష్మిశ్రీశైలం, కడకంచి మధు, జాయ మల్లేశం, కర్రె శ్రీను, పేర్ని స్వరూప రామాంజనేయులు, సేవెల్లి సంపత్, కురుమ సంఘం గౌరవ అధ్యక్షుడు మోటె శ్రీ శైలం, సెక్రటరీ జూకంటి శ్రీశైలం కురుమ, కోశాధికారి కేమిడి ఉపేందర్, కోపా అధ్యక్షుడు కర్రే కృష్ణ, కోశాధికారి ఎండ్రు వైకుంఠం, జెట్టా యాదగిరి, దయ్యాలా శ్రీనివాస్, జూకంటి మధు, దేవర ఉపేందర్, కడకంచి మధు, కవిడె శ్రీను, బాల్దె సత్తెయ్య, బండ సందీప్ ఉన్నారు.

సాయన్న ఆశయ సాధనకు పాటుపడాలి



నివాళులర్పిస్తున్న ముదిరాజ్ యూత్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: పటేల్, పట్వారీల దోపిడీకి, దొరల గడీల పాలనకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన పండుగ సాయన్న ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ముదిరాజ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గోరంట్ల యాదగిరి అన్నారు. మండలంలోని శివునిపల్లిలో ముదిరాజ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం పండుగ సాయన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయన్నముదిరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ యూత్ నాయకులు పిట్టల అనీల్, శాగ సురేష్, రేగుల రాకేష్, పిట్టల రాజశేఖర్, బూర్ల రాజశేఖర్, శివలింగం, రమేష్, తిరుపతి, నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా రాజయ్య



స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన సింగపురం రాజయ్యను నియమించినట్లు పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లా శ్రీరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాజయ్య బుధవారం ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. పార్టీ కోసం తాను చేస్తున్న కృషిని గుర్తించి ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందని, పదవితో తన బాధ్యత మరింతగా పెరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింతగా బలోపేతం చేసేలా శాయశక్తులా కృషి చేస్తానన్నారు. పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు నగరగిరి ప్రీతమ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నల్లా శ్రీరామ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల అందజేత



సరుకులు అందజేస్తున్న దేవేందర్

జనగామ రూరల్: పట్టణానికి చెందిన పోద్దుటూరు నరేశ్ పుట్టిన రోజును పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని రుద్రమదేవి వృద్ధాశ్రమానికి సుంకారి దేవేందర్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే పి.సురేశ్ కుమార్తె అపర్ణ పుట్టిన రోజు సందర్భంగా స్వీట్లు, పండ్లు అందజేశారు. వాసవీ క్లబ్ ప్రతినిధులు ప్రమోద్‌కుమార్, వరునిధి, ఆశ్రమ అధ్యక్షుడు లక్ష్మన్, యాసిన్, లక్ష్మి ప్రసన్న, ఏఎన్ఎమ్, మౌనిక, అనుష పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల భక్తమార్కండేయ స్వామి బ్రహ్మోత్సవాలు, విగ్రహ ప్రతిష్ఠాపన తేదీలు బుధవారం ఖరారు చేశారు. కాగా, బ్రహ్మోత్సవాల ఖర్చుల కోసం పద్మశాలి సంఘం సభ్యుడు బత్తుల రాజన్‌బాబు రూ.10వేల విరాళాన్ని కుల పెద్ద పేరాల రాజమౌళికి అందజేశాడు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ నవంబరు 16 నుంచి 18వ తేదీ వరకు విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద రాజమౌళి, పేరాల చంద్రమౌళి, కుమారస్వామి, సామల రాములు, రఘునాథ్, ప్రభాకర్, డాక్టర్ రాజు, యుగేందర్, నారాయణ, పేరాల రాజన్‌బాబు, రాందాసు, గుర్రం రమేష్, సత్యనారాయణ, సతీష్, కోటేశ్వర్, కాంతయ్య, రాజయ్య, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పాలకుర్తి టౌన్: నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు



బచ్చన్నపేట: బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న శివకుమార్‌గౌడ్

పాలకుర్తి టౌన్: మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన దివ్యాంగుల సంఘం నియోజవర్గ నాయకుడు మంద ఎల్లయ్య గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, బుధవారం మాజీ మంత్రి దయాకర్ రావు గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలో మృతి చెందిన బండారు అజయ్ కుటుంబ సభ్యులను బుధవారం సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ పరామర్శించి రూ. 5వేల సాయం అందజేశారు. నాయకులు భద్రయ్య, శ్రీకాంత్, కనుకయ్య, దశరథ, అంజయ్య, కర్ణాకర్, రమేష్, బాలస్వామి ఉన్నారు. అలాగే అజయ్ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకుడు పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట సిద్ధిరాములు, నర్సింహ్మాచారి, కనకరాజు, ఇస్తారి, బిక్షపతి, రమేష్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో..

చిల్పూరు: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన మోతె రాజు ఇటీవల మృతి చెందాడు. కాగా, బుధవారం మాజీ సర్పంచ్ లొడెం రజితరవీందర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గాలి ప్రవీన్, కొండ రాజయ్య, కొండ రాజు, సంపత్, బండారి వేణు ఉన్నారు.

ఊరూరా పీరీల ఊరేగింపు



లింగాలఘణపురం: నృత్యం చేస్తున్న భక్తులు



జనగామ రూరల్: పట్టణంలో..



తరిగొప్పుల: అబ్దుల్‌నాగారంలో..

సాక్షి నెట్‌వర్క్: ఊరూరా మొహర్రంను పురస్కరించుకొని పీరీలను ఊరేగించారు. హసన్, హుస్సేన్‌ల త్యాగాలను స్మరిస్తూ పదిరోజుల పాటు నిర్వహించిన వేడుకలు బుధవారం నిమజ్జంతో ముగిశాయి. పీరీలను నిలబెట్టిన అనంతరం డప్పుచప్పుళ్ల మధ్య వాటిని ఎత్తుకొని ఇంటింటా ప్రదర్శించగా కులమతాలకతీతంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. యువకులు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. కాగా, పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన బండి కొండయ్య సూర్పనాక వేషధారణతో ప్రజలను ఆకట్టుకున్నారు.



పాలకుర్తి టౌన్: సూర్పనక వేషధారణలో కొండయ్య



దేవరుప్పుల: పీరీలకు మొక్కులు చెల్లిస్తున్న మాజీ ఎంపీపీ సావిత్రిమల్లేషం



జఫర్‌గఢ్‌లో..



బచ్చన్నపేట: పోచన్నపేటలో..

అదుపు తప్పి కల్వర్టులోకి దూసుకెళ్లిన బైక్

● దంపతులకు గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: రోడ్డు పక్కన ఉన్న కల్వర్టులోకి అదుపుతప్పి బైక్ దూసుకెళ్లడంతో బైక్‌పై ఉన్న బొల్లెపల్లి రవి, సుజాత దంపతులు గాయపడ్డ సంఘటన ఘన్‌పూర్ శివారు ఇందిరానగర్ వద్ద బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్ మండలం మల్లికుదుర్ల గ్రామానికి చెందిన రవి, సుజాత బైక్‌పై హైదరాబాద్ నుంచి మల్లికుదుర్లకు వస్తున్నారు. ఈ క్రమంలో ఇందిరానగర్ వద్ద జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కల్వర్టులోకి దూసుకెళ్లింది. దాంతో బైక్‌పై నుంచి దంపతులిద్దరు కింద పడటంతో గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తరలించేందుకు 108 అంబులెన్స్ వారికి సంప్రదించగా అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వాహనంలో హనుమకొండలోని ఆస్పత్రికి తరలించారు.

బైక్‌లు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

చిల్పూరు: మండలంలోని లింగంపల్లి పంచాయతీ పరిధిలోని కొమ్ముగుట్ట వద్ద బుధవారం ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన వెలిశాల సంతోష్ బైక్‌పై పనినిమిత్తం లింగంపల్లికి, తరిగొప్పుల మండలం అబ్దుల్‌నాగారానికి చెందిన కుంభం రమేశ్ బైక్‌పై హనుమకొండకు వెళ్తున్నారు. కొమ్ముగుట్ట క్రాస్ వద్దకు రాగానే రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనగా రమేశ్‌కు తీవ్రగాయాలు కాగా సంతోష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై ముత్యం రాజేందర్ కేసునమోదు చేసుకుని గాయపడిన రమేశ్‌ను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

కబడ్డీ అసోసియేషన్ మండల కమిటీ ఎన్నిక

పాలకుర్తి టౌన్: కబడ్డీ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా కూన సతీష్ ఎన్నికైనట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుమార్‌గౌడ్ ,జిల్లా కార్యదర్శి తోటకూర గట్టయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో కబడ్డీ అసోసియేషన్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షుడి పూజారి దీపక్, ఎడవెల్లి సోమేశ్వర్,కార్యదర్శిగా ఓరుగంటి సురేష్, సహాయ కార్యదర్శిగా గుండు హరీష్, కొమురెల్లి, కోశాధికారిగా రానా ప్రతాప్‌లతో పాటు కమిటీ సభ్యులుగా హరీష్, నాగరాజు, అఖిల్ ఎన్నికయ్యారు.

వరి నారులో కడియం నామం



వరి నారుపై కడియం నామం ఆకృతిని చేసిన ఎల్లయ్య

రఘునాథపల్లి: రాజకీయ నాయకులపై తమ ప్రేమను అనుచరులు, అభిమానులు విభిన్న రూపంలో చూపుతుంటారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై తనకున్న అభిమానాన్ని మండలంలోని మేకలగట్టు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త శెవ్వ ఎల్లయ్య తన వరి నారులో జై కడియం ఆకృతి ఏర్పాటు చేశారు. గతంలోనే ఎల్లయ్య తన చాతిపై కుడి వైపున కడియం బొమ్మను పచ్చబొట్టు వేయించుకొని అభిమానాన్ని చాటుకున్నారు. కడియంపై ఉన్న అభిమానంతోనే వరి నారుతో కడియం పేరును ఏర్పాటు చేశానని ఎల్లయ్య చెప్పారు.

భక్తి భావం కలిగిఉండాలి



భక్తులతో రమేశ్

బచ్చన్నపేట: అందరూ భక్తి భావం కలిగి ఉండాలని ఆర్ఎస్ఎస్ పూర్వ వరంగల్ విభాగ్ కార్యదర్శి గద్ద రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని బండనాగారం గ్రామంలోని రామలింగేశ్వరాలయం, కట్కూర్‌లోని శివాలయంలో పలువురు భక్తులతో సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మాట్లాడారు. వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకుడు దొంతుల శేఖర్, విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రాజయ్య, ఆర్ఎస్ఎస్ మండల ప్రముఖ్ పులిగిళ్ల సుఖేష్, ఆలయ ప్రధాన పూజారి ఆంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



నర్మెట: నూతన ఎస్సైగా నైనాల నగేశ్ బుధవారం బాధ్యలు చేపట్టారు. గతంలో ఎస్సైగా విధులు నిర్వహించిన కన్నెబోయిన శ్రీకాంత్ సుబేదారికి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో సుబేదారి, మరిపెడబంగ్లా, కురవి, దోర్నకల్ విజిలెన్స్, నల్లబెల్లి పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించిన నగేశ్ నర్మెట ఎస్‌హెచ్ఓగా విధులు చేపట్టారు..